

నల్లగొండలో బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డికి చేతులెత్తి మద్దతు తెలుపుతున్న పట్టభద్రులు


నమస్తే తెలంగాణ

# సూర్యాపేట

5 | నల్లగొండ, బుధవారం 22 మే 2024 | SURYAPET


# కాంగ్రెస్‌కు ఓటు వేసి మళ్లీ మోసపోవద్దు

- అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిది



రేవంత్‌రెడ్డి ఒట్లు చూసి దేవుళ్లే భయపడుతున్నరు

బ్లాక్‌మెయిలర్ అయిన కాంగ్రెస్ అభ్యర్థి కావాలా.. గోల్డ్ మెడలిస్ట్ రాకేశ్ రెడ్డి కావాలా?

బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని గెలిపిస్తే మండలిలో నిరుద్యోగుల గొంతుకగా ఉంటాడు

మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఉమ్మడి జిల్లాలో విస్తృత పర్యటన

పాల్గొన్న మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, పార్టీ నేతలు



నల్లగొండలో మాట్లాడుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి, వేదికపై మాజీ మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, జడ్పీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల, మాజీ ఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, గాదరి కిశోర్, భిక్షమయ్యగౌడ్, బీఆర్‌ఎస్ నేతలు ఆర్‌ఎస్ ప్రవీణ్, కర్నె తదితరులు

మిర్యాలగూడ/ నల్లగొండ/ హాలియా, నేరేడుచర్ల, మే 21 : 'అసెంబ్లీ ఎన్నికల్లో అమలు కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఇంతవరకూ ఏ ఒక్కటీ అమలు చేయలేదు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ పార్టీకి ఓటు వేసి మళ్లీ మోసపోవద్దు' అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఉమ్మడి జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. నల్లగొండ, సాగర్, మిర్యాలగూడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పదేండ్లు నిష్టతో తెలంగాణను అభివృద్ధి చేశామని, రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధిని జోడెద్దుల్లా పరుగులు పెట్టించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో ఐటీ రంగం అభివృద్ధిలో దూసుకుపోయిందని, పది లక్షల మందికి ఐటీ ద్వారా ఉద్యోగాలను కల్పించామని చెప్పారు. ఈ సారి గెలిస్తే మిర్యాలగూడకు ఐటీ తీసుకొచ్చేవాళ్లమని తెలిపారు. ఐటీ ఎగుమతులను రూ.57వేల కోట్ల నుంచి రూ.2లక్షల కోట్లకు చేసిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. ఒక వైపు ఐటీ, మరోవైపు వ్యవసాయాన్ని అభివృద్ధి చేశామని చెప్పారు. వరి ధాన్యం ఉత్పత్తిలో దేశంలో తెలంగాణ నెం.1 అయితే.. రాష్ట్రంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా మొదటి స్థానంలో ఉన్నదని తెలిపారు. 2014 నాటికి నల్లగొండలో ఒక్క మెడికల్ కాలేజీ లేదని, కేసీఆర్ నాయకత్వంలో మూడు మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేశారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ కేవలం 1.8శాతం ఓట్ల తేడాతోనే ఓడిపోయిందని, పని చేసి కూడా చెప్పుకోలేకపోవడంతోనే ఓటమి పాలయ్యామని తెలిపారు. పదేండ్లలో భారతదేశంలో అత్యధికంగా ప్రభుత్వ కొలువులు ఇచ్చింది తెలంగాణ రాష్ట్రమేనన్నారు. 2లక్షల ఉద్యోగాలను ఇచ్చి కూడా బీఆర్‌ఎస్ చెప్పుకోలేదన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తరువాత ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని, గాడిద గుడ్డు మాత్రం వచ్చిందని విమర్శించారు. కేంద్రంలోని బడే భాయ్ నరేంద్ర మోదీ ఏటా నిరుద్యోగులకు 2కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్తే.. చోటే భాయ్ రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో ఏటా 2లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. ఇప్పుడు కావాల్సింది తెలంగాణ అధికార స్వరం కాదు.. ధిక్కార స్వరం, శాసన మండలిలో ప్రశ్నించే గొంతుక కావాలని సూచించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని గెలిపిస్తే శాసనమండలిలో ప్రశ్నించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ఏం చదువుకున్నాడో తెలియదని, కానీ.. యూట్యూబ్ చానెల్ పెట్టి బెదిరించి డబ్బులు గుంజే తెలివి బాగుందని పేర్కొన్నారు. జర్నలిస్టు ముసుగులోనే ఇంత మందిని బ్లాక్ మెయిల్ చేసిండని, పొరపాటున గెలిపిస్తే కాంగ్రెస్ నాయకత్వాన్ని ఆగమాగం చేస్తాడని హెచ్చరించారు. అధికారంలోకి రాగానే రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి.. ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్‌ది అభయ హస్తం కాదు.. భస్మాసుర హస్తమని విమర్శించారు. ఉన్నత చదువులు చదివి గోల్డ్‌మెడల్ సాధించిన రాకేశ్‌రెడ్డికి ఓటు వేస్తే ప్రజా గొంతుకగా నిలుస్తాడన్నారు. హుజూర్‌నగర్ లోకల్ వ్యక్తి అని ఆయనను నాయకుడిని చేసి ఎమ్మెల్యేగా గెలిపిస్తే.. పార్టీని మోసం చేసి వేరే పార్టీలోకి పోయాడని పేర్కొన్నారు. అయన పోయినంత మాత్రాన మనకు పోయిందేమీ లేదని, ఆయన సొంత గ్రామ సర్పంచ్ కూడా ఆయనతో పోలేదని ఎద్దేవా చేశారు. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సొంత నియోజకవర్గంలోనే నీళ్లు లేక పొలాలు ఎండిపోయాయని, గ్రామాల్లో తాగు నీరు లేక గొంతెండుతుందని పేర్కొన్నారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని తిట్టిన తీన్మార్ మల్లన్న ఇప్పుడు ఆయన కాళ్లు మొక్కుతున్నాడని ఎద్దేవా చేశారు. మహిళలకు రూ.2500 భృతి ఇస్తామని చెప్పి మోసం చేశారని, రూ.15వేల రైతుబంధు, కౌలు రైతులకు రైతు భరోసా, వ్యవసాయ కూలీలకు రూ.12వేలు, ఆటో డ్రైవర్లకు నెలకు రూ.వెయ్యి ఇస్తామని ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఇన్ని మోసాలకు పాల్పడుతున్న కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమాల్లో మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి, నల్లగొండ జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, భాస్కర్‌రావు, గాదరి కిశోర్‌కుమార్, నోముల భగత్, భిక్షమయ్యగౌడ్, విజయసింహారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు ఒంటెద్దు నర్సింహారెడ్డి, కంచర్ల కృష్ణారెడ్డి, చెరుకు సుధాకర్ గౌడ్, చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, కటికం సత్తయ్య గౌడ్, చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రాంచందర్‌నాయక్, రాజీవ్‌సాగర్, యడవల్లి విజయేందర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రావు, కడారి అంజయ్యయాదవ్, మోసిన్ అలీ, అన్నభీమోజు నాగార్జునచారి, చీర పంకజ్ యాదవ్, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, నిరంజన్ వలీ, బొర్ర సుధాకర్, తండు సైదులు గౌడ్, మందడి సైదిరెడ్డి, కొండూరు సత్యనారాయణ, బక్క పిచ్చయ్య, మాలె శరణ్యారెడ్డి, అభిమన్యు శ్రీనివాస్, బోనగిరి దేవేందర్, కరీంపాషా పాల్గొన్నారు.



హుజూర్‌నగర్‌లో బీఆర్‌ఎస్ సమావేశానికి హాజరైన పట్టభద్రులు, పార్టీ శ్రేణులు

## బ్లాక్ మెయిలర్స్‌కు కాదు.. విద్యావంతులకు అవకాశం ఇవ్వండి



'పెద్దల సభ అంటే మేధావుల సభ. అది బ్లాక్ మెయిలర్స్‌కు అడ్డా కాకుండా ఉండాలంటే విద్యావంతుడు, వినయుడు అయిన ఏనుగుల రాకేశ్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలి. కాంగ్రెస్ అభ్యర్థి నేచర్ బ్లాక్ మెయిల్ తత్వం. అలాంటి వాళ్లకు ఓటేస్తే మండలి బ్లాక్ మెయిలర్స్‌కు అవకాశం ఇచ్చినట్లు అవుతుంది. రోజుకో పార్టీ మారి ఆ పార్టీలోని వ్యక్తులనే నిత్యం తిట్టిపోసిన ఘనుడికి కాంగ్రెస్ పార్టీ సీటు ఇవ్వడం సిగ్గుచేటు. బిట్స్ పిలానీలో చదివి అమెరికాలో మంచి ఉద్యోగం వదిలి ప్రజా సేవ చేయడానికి వచ్చిన రాకేశ్‌రెడ్డిని ఆశీర్వదించి మండలికి పంపాలి. తెలంగాణ రాష్ట్రం తీసుకొచ్చి ప్రపంచం మొత్తానికి పరిచయం చేసి పారిశ్రామికవేత్తలు భారతదేశంలో ఏ పరిశ్రమ పెట్టాలన్నా అది హైదరాబాద్‌కే రావాలని అద్భుతంగా అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌దే. ఈ దేశంలో 20లక్షల మందికి ఉపాధి కల్పించిన మొట్టమొదటి నాయకుడు కేసీఆర్. బీజేపీ అభ్యర్థి ఒక అసమర్థుడు. ఆయన చాలాకాలంగా రాజకీయాల్లో ఉంటున్నాడు. కానీ.. ఏ సమస్యపైనా స్పందించని వ్యక్తి. ప్రశ్నించే గొంతుక కావాలో.. లేదంటే బ్లాక్ మెయిలర్ కావాలో.. లేక అసమర్థ నాయకుడు కావాలో.. నిర్ణయించుకోవాలి.'

– మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

## అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి



అడ్డగోలు హామీలు ఇచ్చి అబద్ధపు ప్రచారంతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఐదు నెలల్లోనే రాష్ట్రాన్ని సర్వనాశనం చేసింది. పట్టభద్రులు విచక్షణతో ఆలోచించి ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలి. 420 హామీలు, ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన తర్వాత పాలన పక్కన పెట్టి ప్రతిపక్షంలో ఉన్న బీఆర్‌ఎస్‌ను తిట్టడం ఎంతవరకు సమంజసం. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏం చేసింది.. ప్రస్తుత కాంగ్రెస్ ఏం చేస్తుందో పట్టభద్రులు ఆలోచించి ఓటు వేయాలి.

– వి.శ్రీనివాస్‌గౌడ్, మాజీ మంత్రి

## నిజానికి, అబద్ధానికి మధ్య జరుగుతున్న యుద్ధమిది



ఇప్పుడు రాష్ట్రంలో జరుగుతున్నది నిజానికి, అబద్ధానికి మధ్య యుద్ధం. ఇది రాకేశ్‌రెడ్డి, మల్లన్న మధ్య యుద్ధం కాదు.. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీ మధ్య యుద్ధం కాదు. ఇది పది సంవత్సరాల నిప్పు లాంటి నిజమైన కేసీఆర్ పాలన మధ్య ఆరు నెలల నయవంచక కాంగ్రెస్ పాలన మధ్య జరుగుతున్నది. ఆ యుద్ధంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డికి ఓటు వేసి పట్టభద్రులు నిజం వైపు నిలబడాలి. తీన్మార్ మల్లన్న పెద్ద బ్లాక్ మెయిలర్. మైనర్లు, మహిళలను సైతం బ్లాక్ మెయిల్ చేస్తే ఆ కేసు తన దగ్గరకే వచ్చింది. ఆడపిల్లలకు సంబంధం లేకుండా వారి ఫోన్ నెంబర్లు సోషల్ మీడియాలో పెట్టి ఆ కుటుంబాలను ఎంతో ఇబ్బంది పెట్టాడు. 76 కేసులు ఉన్న తీన్మార్ మల్లన్న ఈ సమాజానికి చీడ పురుగులాంటి వాడు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం తనపై అన్యాయంగా కేసులు పెట్టిందని చెప్పుకొనే మల్లన్నను కోర్టు ఎందుకు శిక్షించిందో చెప్పాలి. ప్రభుత్వం అనవసర కేసులు పెడితే కోర్టు తోసిపుచ్చుద్ది. అలాంటిది తీన్మార్ మల్లన్న విషయంలో జరుగలేదంటే అవన్నీ నిజమైన కేసులే. పట్టభద్రులు ఎవరికి ఓటు వేయాలో విచక్షణతో ఆలోచించాలి. విద్యావంతుడు, సౌమ్యుడు ఎవరో చూడాలి. అసత్యం, అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఈ ఐదు నెలల్లో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బ్లాక్ మెయిలర్‌కు టికెట్ ఇవ్వడం దారుణం. నిత్యం బ్లాక్ మెయిల్ చేసే తీన్మార్ మల్లన్నకు ఓటేస్తే రానున్న రోజుల్లో అలాంటి వారు ఎందరో పుట్టుకొస్తారు. అలాంటి వ్యక్తులను ఓడించి మేధావి అయిన రాకేశ్‌రెడ్డిని మండలికి పంపాలి.

– ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

## ఎమ్మెల్సీగా గెలిపిస్తే నా గౌరవ వేతనం నిరుద్యోగులకే ఖర్చు చేస్తా

పట్టభద్రుల ఎమ్మెల్సీగా నన్ను గెలిపిస్తే ప్రభుత్వం ఇచ్చే గౌరవ వేతనం నిరుద్యోగుల సంక్షేమం కోసమే ఖర్చు చేస్తా. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌కు పత్రాలు ఇచ్చి మేము ఉద్యోగాలు ఇచ్చామని చెప్పుకోవడం కాంగ్రెసోళ్లకే చెల్లింది. డిసెంబర్ 9న హామీలు అమలు చేస్తామన్న కాంగ్రెస్ సర్కారు మాటలు ఏమాయ్యాయి? ఐదు నెలలైనా ఇప్పటి వరకు జాబ్ క్యాలెండర్, డీఎస్సీ నోటిఫికేషన్, నిరుద్యోగ భృతి, ఉద్యోగులకు పీఆర్సీ ఎందుకు ఇవ్వలేదు. జీఓ 46 ద్వారా కొంత మందికి అన్యాయం జరిగితే బీఆర్‌ఎస్ ప్రభుత్వం సరిదిద్దే సమయంలో ఎన్నికల కోడ్ వచ్చింది. అధికారంలోకి రాగానే రద్దు చేస్తామన్న కాంగ్రెస్ ఎందుకు చేస్తలేదు. విచక్షణ కలిగిన పట్టభద్రులు.. బ్లాక్ మెయిలర్స్ ఎవరో, మంచివారు ఎవరో ఆలోచించి ఓటు వేయాలి. చుక్కా రామయ్య నుంచి పల్లా రాజేశ్వర్‌రెడ్డి వరకు విద్యావంతులనే మండలికి పంపారు. జర్నలిజం ముసుగులో ఎర్నలిస్టుగా మారిన వ్యక్తులకు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి. కాంగ్రెస్ అభ్యర్థి గెలిస్తే జాబ్ క్యాలెండర్, పీఆర్సీ, మెగా డీఎస్సీ గురించి ప్రభుత్వాన్ని ప్రశ్నించలేడు. నన్ను గెలిపిస్తే నిరుద్యోగులు, ఉద్యోగుల పక్షాన నిలబడి ప్రభుత్వంపై పోరాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా. రాకేశ్‌రెడ్డి గెలిస్తే ఉద్యోగి గెలిచినట్లు, బీఆర్‌ఎస్‌ను బలోపేతం చేస్తేనే రాష్ట్ర ప్రజలకు న్యాయం జరుగుతుంది.

– ఏనుగుల రాకేశ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి

## రైతు వ్యతిరేక ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి

ప్రజలకు, రైతులకు మాయమాటలు చెప్పి, మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చి మాట తప్పింది. 420 హామీలను ఇచ్చి వాటి ఊసే ఎత్తడం లేదు. తినే అన్నంలో మట్టి పోసుకున్నట్లుగా ప్రజలు సీఎం కేసీఆర్‌ను దూరం పెట్టారు. ఇప్పుడు ప్రజలకు తెలిసి వస్తుంది. బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ గ్రామాన పటిష్టంగా ఉన్నది. ఎవరో పోయినంత మాత్రాన పార్టీకి నష్టం లేదు. నాయకులు, కార్యకర్తలంతా రాకేశ్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేయాలి.

– మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

## రాకేశ్‌రెడ్డిని గెలిపించాలి

నల్లగొండ – వరంగల్ – ఖమ్మం పట్టభద్రుల ఉప ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి ఈ ప్రాంత గ్రాడ్యుయేట్లు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలి. గతంలోనూ ఈ ప్రాంత ఓటర్లు ఎమ్మెల్సీగా పల్లా రాజేశ్వర్‌రెడ్డిని గెలిపించారు. హామీల అమలులో విఫలం చెందిన కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచేందుకు రాకేశ్‌రెడ్డిని గెలిపించాల్సిన బాధ్యత మీపై ఉన్నది.

–ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటాలి



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించి పార్టీ సత్తా చాటాలి. తొమ్మిదిన్నరేండ్లలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుంది. ఇచ్చిన హామీలను నెరవేర్చలేని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ ఎన్నికల్లో పట్టభద్రులు గుణపాఠం చెప్పాలి. తొమ్మిదిన్నరేండ్లలో మిర్యాలగూడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిలో ముందుంచా. ఇకముందు కూడా ప్రజల పక్షాన ఉండి ప్రజా సమస్యలపై పోరాటం చేసి వారికి అండగా ఉంటా. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థికి మిర్యాలగూడ నియోజకవర్గం నుంచి అత్యధిక మెజారిటీ అందించాలి.

– మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు

## మాయ మాటలను చెప్పే కాంగ్రెస్‌ను నమ్మవద్దు

కాంగ్రెస్ పార్టీ మాయ మాటలు చెప్పి, మాయదారి హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చింది. డిసెంబర్ 9న రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి నేటికీ చేయలేదు. వృద్ధులకు పింఛన్ రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6వేలు, మహిళలకు రూ.2500 భృతి, నిరుద్యోగులకు రూ.4వేల భృతి, యువతులకు స్కూటీలు ఇస్తామని చెప్పి మోసం చేశారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలంటే రాకేశ్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి.

– మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి

# ఎంజీయూ ఇన్‌చార్జి వీసీగా నవీన్ మిట్టల్

- ముగిసిన వీసీ గోపాల్‌రెడ్డి మూడేండ్ల పదవీకాలం
- నేడు అధికారికంగా బాధ్యతలు తీసుకోనున్న నవీన్ మిట్టల్



రామగిరి, మే 21 : నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ ప్రస్తుత వీసీ చొల్లేటి గోపాల్‌రెడ్డి పదవీ కాలం మంగళవారంతో ముగిసింది. దీంతో ఐఏఎస్ నవీన్ మిట్టల్‌ను ఇన్‌చార్జి వీసీగా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. తెలంగాణ వ్యాప్తంగా పది యూనివర్సిటీలకు 2021 మే 22న వైస్ చాన్స్‌లర్ల నియామకం చేయగా వారి పరిపాలనకు తెరపడింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం సీనియర్ ఐఏఎస్ అధికారులను ఆయా యూనివర్సిటీలకు ఇన్‌చార్జి వీసీలుగా నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా ఎంజీయూకు ఐఏఎస్ నవీన్‌మిట్టల్‌ను నియమించింది. అధికారికంగా ఆయన బుధవారం ప్రస్తుత వీసీ గోపాల్‌రెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉన్నట్లు సమాచారం. నవీన్ మిట్టల్ ఎంజీయూకు ఆరో ఇన్‌చార్జి ఐఏఎస్ కావడం గమనార్హం. ప్రస్తుత వీసీకి ఎంజీయూలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందితోపాటు వివిధ హోదాల్లో పనిచేస్తున్న అధికారులు బుధవారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి సన్మానం చేస్తునట్లు ఓ అధికారి వెల్లడించారు. ఆయన 2021 మే 24నుంచి 2024 మే 21వరకు వీసీగా పనిచేశారు.

# 24న టీఎస్ పాలీసెట్

- నిమిషం ఆలస్యమైనా అనుమతి నిరాకరణ
- నల్లగొండ జిల్లా కేంద్రంలో 9 పరీక్ష కేంద్రాలు
- హాజరు కానున్న 3,842 మంది విద్యార్థులు

రామగిరి, మే 21 : తెలంగాణలోని పాలిటెక్నికల్ డిప్లమో కోర్సుల్లో (ఇంజినీరింగ్, అగ్రికల్చర్ తత్సమాన) ప్రవేశానికి నిర్వహించే టీఎస్ పాలీసెట్ – 2024 పరీక్ష ఈ నెల 24న నిర్వహించనున్నట్లు పాలీసెట్ జిల్లా కన్వీనర్, నల్లగొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జానకీదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 11నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. నిర్ణీత సమయానికి నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతి ఉండదని తెలిపారు. గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 3,842 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నారని, వారి కోసం జిల్లా కేంద్రంలో 9కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

### పరీక్ష కేంద్రాలు..

నీలగిరి డిగ్రీ అండ్ పీజీ కళాశాల, ఆల్ఫా జూనియర్ కళాశాల (బాలికలు), ఆల్ఫా జూనియర్ కళాశాల (కో ఎడ్యుకేషన్), ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, కేపీఎం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, కేపీఎం ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, నాగార్జున (ఎన్జీ) ప్రభుత్వ డిగ్రీ కళాశాల.

# రేపు టీఎస్ ఎడ్‌సెట్

- నల్లగొండ, సూర్యాపేట, కోదాడలో పరీక్ష కేంద్రాలు

రామగిరి, మే 21 : తెలంగాణలో రెండేండ్ల బీఈడీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే టీఎస్ ఎడ్‌సెట్ – 2024 ప్రవేశ పరీక్ష ఈ నెల 23న జరుగనుంది. నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో ఆన్‌లైన్‌లో నిర్వహించే ఈ పరీక్ష రెండు షిఫ్టులలో జరుగనుంది.

ఇందు కోసం నల్లగొండలోని ఎస్పీఆర్ స్కూల్ ప్రాంగణంలోని డీపీఎంఎస్ ఆన్‌లైన్ సెంటర్‌లో, సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజీ, కోదాడలోని సనా ఇంజినీరింగ్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. అభ్యర్థులంతా సకాలంలో హాజరు కావాలని సూచించారు.

# దొడ్డు వడ్లకూ బోనస్ ఇవ్వాలి

- కాంగ్రెస్ మేనిఫెస్టోలో చెప్పింది ఏంటి.. చేస్తున్నదేంటి?
- రైతులను మోసం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి
- సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ ఎదుట రైతుల ధర్నా
- ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం



సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

బొడ్రాయిబజార్, మే 21 : కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం అన్ని రకాల ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ ఎదుట మంగళవారం రైతులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి మేనిఫెస్టోలో చెప్పిందొకటి.. చేసేదొకటి అన్నారు. అన్ని రకాల ధాన్యానికి బోనస్ ఇస్తామని చెప్పి నేడు సన్న వడ్లకు మాత్రమే చెల్లిస్తామనడం రైతులను మోసం చేయడమేనని విమర్శించారు. సన్న రకం ధాన్యం మార్కెట్‌కు రాదని, ఎక్కువగా మిల్లర్లు కొనుగోలు చేస్తారని, మార్కెట్‌కు వచ్చేది దొడ్డు వడ్లు మాత్రమేనని అన్నారు. నేల స్వభావాన్ని బట్టి నల్లరేగడి, చౌడు నేలల్లో ఎక్కువ శాతం రైతులు దొడ్డు ధాన్యం పండిస్తుంటారని తెలిపారు. దొడ్డు రకాలకు బోనస్ ఇవ్వబోమనడం సరికాదన్నారు. కేసీఆర్ ఉన్నన్ని రోజులు రైతులను కంటికి రెప్పలా కాపాడుకున్నారని, కరెంట్, కాళేశ్వరం నీళ్లు, పంట మొదట్లో రైతుబంధు ఇచ్చి ఆదుకున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాళేశ్వరం నీళ్లు, సరిగా కరెంట్ ఇవ్వడం లేదన్నారు. రైతు బంధు కూడా పంట చివర్లో ఇస్తున్నాడని ఆరోపించారు. కరెంటు, నీళ్లు లేక తమ పంటలు ఎండిపోయాయని, ఉన్న కొద్ది పంట అమ్ముకునేందుకు నానా అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కోతలు లేకుండా కరెంట్, కాళేశ్వరం ద్వారా సాగునీరు, పంట మొదట్లో రైతు బంధు ఇవ్వాలని, రుణ మాఫీ చేసి రైతులను ఆదుకోవాలని ముఖ్యమంత్రిని కోరారు. అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇస్తళాపురం, ఆత్మకూర్.ఎస్, రామన్నగూడెం, కాసరబాద, పెన్‌పహాడ్, చీదెళ్ల గ్రామాలకు చెందిన రైతులు తూడి రాములు, గునగంటి భిక్షం, జటంగి వెంకటయ్య, వెంకట్‌రెడ్డి, జూలకంటి, మల్లయ్య, సైదులు, వెంకన్న, లక్ష్మయ్య, యలమంచయ్య, మల్లయ్య, మహేందర్ పాల్గొన్నారు.

### నాగారంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

నాగారం : దొడ్డు ధాన్యానికి కూడా బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో సూర్యాపేట – జనగాం జాతీయ రహదారిపై బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రైతులు ధర్నా చేశారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో రైతులు అంబయ్యగౌడ్, మల్లేశ్, సైదులు, అరుణ్, సోమిరెడ్డి, జనార్దన్, మురళి, వెంకన్న, శోభన్‌బాబు, ప్రశాంత్, పరశురాములు, నాగయ్య, వెంకన్న, వెంకటేశ్, మైసయ్య పాల్గొన్నారు.